క్లుప్తంగా

ఉచిత దంత వైద్య శిబిరం

ఖమ్మంక్రైం: నగరంలోని పరుచూరి సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాలలో విశ్రాంత పోలీస్ అధికారులకు వైద్యుడు పరుచూరి వెంకటేశ్వరావు ఆధ్వర్యాన మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణమూర్తి, రుద్రవెంకటనారాయణ, రిటైర్డ్ ఎస్పీ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే రాములునాయక్, విశ్రాంత పోలీస్ అధికారులు చంద్రశేఖర్‌రావు, అంజనేయులు, కోటేశ్వరరావు, రాజారావు, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

అన్నదానం

కామేపల్లి: ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో అయ్యప్ప స్వామి మాలధారులకు మహా అన్నదానం చేసి రాత్రి పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్యయాదవ్, యువజన సంఘం నాయకుడు చిత్తూరు సింహాద్రియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు కంప్యూటర్లు, ఫర్నీచర్ అందజేత

కూసుమంచి: కూసుమంచిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వీరస్వామి విజ్ఞప్తి మేరకు దయాకర్‌రెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన కంపూటర్లను సమకూర్చారు. ఈమేరకు మంగళవారం వాటిని ప్రారంభించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అభ్యాసకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, దుప్పట్లు..

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో గల బీసీ హాస్టల్ విద్యార్థులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ అందించిన నోట్ పుస్తకాలు, దుప్పట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బానోత్ కిషోర్, మాజీ ఎంపీటీసీ యరగర్ల హనుమంతరావు, గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో హెడ్ కుక్ (మహిళ) పోస్టు కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మంఅర్బన్ ఎంఈఓ కె.శైలజాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు నగరంలోని వెలుగుమట్ల వద్ద గురుకుల పాఠశాలలో దరఖాస్తులు అందించాలన్నారు.10వ తరగతి పాస్ అయి, వంటలో అనుభవం, స్థానికులై 18 నుంచి 45లోపు వయసు కలిగిన వారు సంబంధిత సర్టిఫికెట్లు జత చేసి అందించాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ.5 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఏపీఓ నర్సింహారావు, మాజీ ఎంపీటీసీ కరుణ, వెంకటనారాయణ పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం



దీపోత్సవం చేసి పూజలు చేస్తున్న భక్తులు

రఘునాథపాలెం: లోక మాత అహిల్యాబాయి హోల్కర్ త్రి శతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా మండలంలోని చిమ్మపూడిలో సోమవారం రాత్రి సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యాన కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు నుంచి వచ్చిన భక్తులు దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అప్పాల ప్రసాద్‌జీ, విశోక తీర్థ స్వామి, అధ్యక్షుడు శ్రీకోటిరెడ్డి, ఉపాధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి కీసర జయపాల్‌రెడ్డి, కార్యదర్శి రమేష్, రామకృష్ణారెడ్డి, మోహన్‌కృష్ణ, శ్రావణ్, రాఘవ, నవీన్, పవన్, సునీల్, భావ్‌సింగ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్, ఆటోనగర్, శ్రీరామ్‌నగర్, మారుతీనగర్, అవేర్ కాలనీ, వెంపటినగర్, స్తంభాద్రినగర్, తాళ్లేసేతండా, చినతండా, సత్యనారాయణపురంలలో మంజూరైన సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని యూత్‌కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు భూక్యా సురేష్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పనులు మంజూరై నెలలు గడుస్తున్నా ఇంత వరకు చేపట్టకపోవడంతో సరికాదని, వెంటనే పనులు మొదలుపెట్టాలని కోరారు.

సందిగ్ధంలో సాగర్..!



కాల్వ కట్ట కొట్టుకుపోవడంతో మిగిలిన కొదుమూరి లిఫ్ట్ పంపుల కోసం వేసిన కాంక్రీట్

సాగర్ ప్రధాన కాల్వకట్టకు భారీకోత

- భారీవర్షాల సమయాన దెబ్బతిన్న వైనం
- రెండు నెలలు దాటినా పట్టించుకోని అధికారులు
- మరమ్మతులకు అంచనాల రూపకల్పనలో జాప్యం

ఖమ్మంఅర్బన్: కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న సాగర్ ప్రధాన కాల్వకట్ట గత రెండు నెలలు క్రితం వచ్చిన వరదలకు కోతకు గురైంది. దీంతో జల వనరులశాఖ అధికారులు వరదలతో దెబ్బతిన్న వాటి ప్రతిపాదనలో దీన్ని కూడా పంపారు. కానీ ఇంతవరకు దానికి సంబంధించిన అంచనాలు రూపొందించలేదని తెలిసింది. సాగర్ ప్రధాన కాల్వపై ఉన్న కొదుమూరు వందనం లిఫ్ట్ ఇరిగేషన్‌కు నీరు అందించేందుకు సాగర్ ప్రధాన కాల్వకు పంపులు ఏర్పాటు చేశారు. అయితే వరద కారణంగా పంపులు వేసిన ప్రాంతంలో కాంక్రీట్ మినహా మట్టి మొత్తం కొట్టుకుపోయి లిఫ్ట్ వైపు కట్టంతా కోతకు గురై భారీ గుంత పడింది. దీంతో వీవీపాలెం నుంచి ఎస్ఆర్ గార్డెన్స్ వైపు కట్టపై నడక, ద్విచక్ర వాహనాలు మినహా రాకపోకలు నిలిపివేశారు.



కోతకు గురైన కాల్వకట్ట

సమన్వయం లేక..

వరద నష్టంలో ఉన్నా దీనికి సంబంధించి ఇంత వరకు అంచనాలు రూపొందించలేదు. జల వనరులశాఖ అధికారుల మధ్య సమన్వయం లేకనో.. ఇతర ఏ కారణమో కాని మరమ్మతులకు అంచనాలు తయారు చేయలేదని తెలిసింది. లిఫ్ట్ ఇరిగేషన్ పంపుల వద్ద కాబట్టి మధిర పరిధి జలవనరుల అధికారులు అంచనాలు వేస్తారని ప్రధాన కాల్వ పర్యవేక్షణ ఇంజనీర్లు, ప్రధాన కాల్వ కాబట్టి ప్రధాన కాల్వ పర్యవేక్షణ ఇంజనీర్లు అంచనాలు వేస్తారని ఒకరికొకరు సందిగ్ధంలో ఉండి ఇప్పటికీ రూపొందించలేదని తెలిసింది. ఈ విషయంపై ఖమ్మం ఈఈ అనన్యను వివరణ కోరగా.. లిఫ్ట్ వద్ద ఉంది కాబట్టి దాన్ని లిఫ్ట్ పర్యవేక్షణ ఇంజనీర్లు చేస్తారన్నారు. అదేవిధంగా లిఫ్ట్ పరిధి పర్యవేక్షణ డీఈని వివరణ కోరగా.. ప్రధాన కాల్వ కాబట్టి వారే అంచనాలు వేస్తారని తెలిపారు. ఇలా ఇద్దరి మధ్య సమన్వయం లేక సందిగ్ధం గుంతగా మారింది.

‘ఉపాధి’ పనులను వినియోగించుకోండి



ఉపాధి పనుల ప్రారంభంలో పాల్గొన్న డీపీఓ

కూసుమంచి: మన ఊరిలో పనుల జాతరలో భాగంగా చేపట్టిన ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ఆశాలత అన్నారు. మంగళవారం కూసుమంచి గ్రామంలో ఉపాధి పనులను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో పనులను ప్రారంభించామని, తద్వారా కూలీలకు ఉపాధి కల్పించబడడంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితాల సవరణలపై చర్చించి వారి సూచనలు స్వీకరించారు. మండలంలో సమగ్ర ఇంటింటి సర్వేపై ఆరా తీసి డేటా ఎంట్రీ నమోదును పరిశీలించి తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ రాంచందర్‌రావు, ఈజీఎస్ ఈసీ కరుణ, గ్రామ కార్యదర్శి నీరజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు

నేలకొండపల్లి: ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా మన ఊరిలో పనుల జాతర అనే కార్యక్రమం ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. మండలంలోని కట్టుకాచారం పాఠశాలలో ఇంకుడు గుంతలకు ఎంపీడీఓ ఎం.యర్రయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడి వంద రోజులు పూర్తి చేసిన కూలీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, పాఠశాల ఉపాధ్యాయులు ఐ.సురేష్, రామదాసు, కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని డివైడర్లు, రోడ్ల వెంట, ఇతర స్థలాల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక అన్నారు. మంగళవారం వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లతో ఆమె సమావేశమైన సందర్భంగా ఆమె మాట్లాడారు. మొక్కలకు నీరు పోసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని దాని ప్రకారం నీటిని సరఫరా చేయాలన్నారు.

వరద బాధితులకు వంట పాత్రలు అందజేత

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని దానవాయిగూడెంలో మంగళవారం సుమారు 300 మంది వరద బాధితులకు హైదరాబాద్, విజయవాడలకు చెందిన అప్పికట్ల భరత్ భూషణ్ చారిటబుల్ ఫౌండేషన్, గ్రేస్ ఫౌండేషన్ శాలెంరాజు, బంధు సొసైటీలు సంయుక్తంగా వంట పాత్రలను అందించాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ పాడి పరిశ్రమ ఉప సంచాలకులు మోహనమురళి, వంట పాత్రల వితరణ సంస్థల ప్రతినిధులు కల్లబత్తుల సరోజ్ ప్రకాశ్, కొలకలూరి ప్రసాద్, క్రీస్తు సంఘం బోధకులు టి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ప్రతినిధులపై ఫిర్యాదు

నేలకొండపల్లి: నేలకొండపల్లిలో ఇటీవల వాసవీ క్లబ్ ఆధ్వర్యాన చేపట్టిన డాన్ టు డస్క్ కార్యక్రమానికి అవసరమైన ఖర్చు తనతో చేయించి, వచ్చిన డబ్బులు తనకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని గెల్లా కృష్ణారావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అంతేకాక తనను వేధిస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

కుటుంబం ఓట్లన్నీ ఒకే చోటుకు..

నేలకొండపల్లి: పంచాయతీ ఎన్నికల నేపథ్యాన కుటుంబం ఓట్లన్నీ ఒకే చోటుకు చేర్పించి జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీఓ ఎం.యర్రయ్య తెలిపారు. ఈమేరకు మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించిన అఖిల పక్షం సమావేశంలో ఆయన జాబితాను విడుదల చేశారు. మండలం నుంచి వచ్చిన దరఖాస్తుల ఆధారంగా 760 మంది ఓటర్లను వారి కుటుంబాలు ఉన్న చోటుకు చేర్పించారని, ఈ నెల 30న తుది జాబితాలో వెలువడుతుందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, ఆఫ్ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, నాయకులు ఎన్.మల్లయ్య, రామదాసు, హనుమంతరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసాదరెడ్డి జన్మదిన వేడుకలు



ఖమ్మంవన్‌టౌన్: కేక్ కట్ చేస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్/కూసుమంచి: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు అందించగా పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న సహస్ర చండీయాగం



సహస్ర చండీయాగంలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: లోక కల్యాణార్థం నగరంలోని మమత రోడ్‌లో నిర్వహిస్తున్న సహస్ర చండీయాగంలో భాగంగా మంగళవారం అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యపాసన, దీక్షాధారణ, రుత్విగ్వరణం, వేద బ్రాహ్మణ పరిచయం చేసి యాగశాల ప్రవేశం చేశారు. ద్వారపూజ, అఖండ స్థాపన, ప్రధాన కలశ ఆవాసన వంటి కార్యక్రమాలను నిర్వహించాక అన్నదానం చేశారు. సాయంత్రం సహస్ర చండీహోమం, మహాలింగార్చన, జ్యోతి లింగార్చన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. యాగబ్రహ్మ రాజోలు భాను రవికిరణ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమల్లో భద్రాద్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి దంపతులు, యాగకర్త దండ్యాల లక్ష్మణ్‌రావు, గుర్రం మురళి, తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్‌బీఐటీ’లో ఫ్రెషర్స్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ కృష్ణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో మంగళవారం ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ‘ఎంబార్క్ ’పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అటానమస్ హోదాతో తొలిసారిగా కళాశాలకు విచ్చేసిన విద్యార్థులకు తమ కళాశాల అన్ని విధాలా తోడుగా ఉండిప్రతీ ఒక్కరికీ ప్లేస్‌మెంట్‌లు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కరస్పాండెంట్ జి.ధాత్రి మాట్లాడగా.. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ఎన్.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

‘బొమ్మ’లో..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ రాజేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: నగరంలోని బొమ్మ కాలేజీలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాలేజీ చైర్మన్ రాజేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ సీనియర్స్ వద్ద నుంచి మంచిని గ్రహించి అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. వైస్ చైర్మన్ సత్యప్రసాద్, కార్యదర్శి ఉదార్‌శ్రీధర్, అనూష పాల్గొన్నారు.

రెజొనెన్స్ శ్రీనివాసనగర్‌లో రెడ్ అండ్ గ్రీన్ డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనివాసనగర్‌లో గల రెజొనెన్స్ పాఠశాలలో మంగళవారం రెడ్ అండ్ గ్రీన్ డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్ర కుమార్, నీలిమలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ డే ప్రాముఖ్యతను తెలియజేసేలా రకరకాల ఆట బొమ్మలు, పక్షుల బొమ్మలను విద్యార్థుల చేత అందంగా తీర్చిదిద్దామన్నారు. అదే విధంగా గ్రీన్ డే కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

లాయర్స్ డే

ఖమ్మంలీగల్: బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం లాయర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేరెళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రూపొందించిన రాజ్యాంగసభలో ఉన్న సభ్యులలో చాలా మంది న్యాయవాదులేనన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, బీ.ఎన్.రావు వంటి న్యాయవాదులు రాజ్యాంగ రచనలో కీలక పాత్ర పోషించారన్నారు.

‘న్యూవిజన్’ విద్యార్థి ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: ఇటీవల నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరిగిన అండర్–14 టెన్నిస్ జిల్లా జట్టులో విద్యార్థి వీరవర్ధన్ కొరివి ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టుకు ఎంపికై నట్లు న్యూవిజన్ పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని అభినందించారు. ప్రిన్సిపాల్ జీవీ మైఖేల్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



జాస్తిపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం మండలంలోని జాస్తిపల్లిలో రూ.1.50 లక్షలతో సీసీ రోడ్డు, కొత్తలింగాలలో మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన కోళ్ల షెడ్, పొన్నేకల్‌లో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగా కోట్ల రూపాయలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు ధనియాకుల హన్మంతరావు, పుచ్చకాయల వీరభద్రం, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, సీడీపీఓ దయామణి, నాయకులు నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు, గుగులోత్ గబ్రూనాయక్, మాలోత్ బావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

● యూటీఎఫ్ జిల్లా మహాసభలను..

ఖమ్మం సహకారనగర్: వచ్చే నెల 14, 15 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా 6వ విద్యా మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం వారు మాట్లాడారు. మహాసభల్లో సెమినార్స్ ఏర్పాటు చేసి విద్యారంగం గురించి చర్చిస్తామన్నారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, నాణ్యమైన విద్య అందరికీ అందించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించుటకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి గత ఐదేళ్ల శాసనమండలిలో విద్యారంగంపై ప్రస్తావించిన అంశాల పుస్తకాలను ఆవిష్కరించారు. మరోసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బుర్రి వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, రంజాన్, నరసయ్య, కె.గీత, ఉద్దండ్, షరీఫ్ పాల్గొన్నారు.

● సీపీఎం పాలేరు డివిజన్ మహాసభను

తిరుమలాయపాలెం: ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం గ్రామంలో డిసెంబర్ 12న జరిగే సీపీఎం పాలేరు డివిజన్ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని హైదర్‌సాయిపేట గ్రామంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలో పాలేరు నియోజకవర్గంలో ఉన్న సమస్యలు, పార్టీ అభివృద్ధిపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ కమిటీ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా గ్రామంలో ఉద్యమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి శ్రీను, మండల నాయకులు అంగిరేకుల నరసయ్య, బింగి రమేష్, వేగినాటి వెంకట్రావు, పద్మనాభుల సుధాకర్, కొలిచలం స్వామి, పప్పుల ప్రసాద్, కొత్తపల్లి వెంకన్న, వీరన్న, రమేష్, దిండు మంగపతి, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● ఐఏఎల్ రాష్ట్ర మహాసభలను..

ఖమ్మం లీగల్: ఈ నెల 30, వచ్చే నెల ఒకటిన హన్మకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించే ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావులు న్యాయవాదులకు పిలుపునిచ్చారు. మంగళవారం కోర్టు ఆవరణలో మహాసభల పోస్టర్లను గోడకు అతికిస్తూ ప్రచారం చేశారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై మహాసభలలో చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పాటిబండ్ల సంజయ్‌కుమార్, ఐఏఎల్ జిల్లా సహాయ కార్యదర్శి మేకల నవీన్‌కుమార్, జీవీ లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, ఎండీ పర్వేజ్, ముత్యం దామోదర్, గాజుల అమరనాథ్, ఆర్.రాకేష్, ఎం.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● చలో హైదరాబాద్‌ను..

ఖమ్మంఅర్బన్: మాలల సింహగర్జన కార్యక్రమం పోస్టర్లను రఘునాథపాలెం మాల మహానాడు మండల అధ్యక్షుడు అంతోటి బుచ్చయ్య, ఇర్లల లలిత రాజ్ ఆధ్వర్యాన మంగళవారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రెంటల ప్రసాద్, కొర్లపాటి రామారావు, మాజీ ఎంపీటీసీ రెంటాల దానయ్య, కందుల వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి మణిరత్నం, అంతోటి రాము, కందుల గోపి, కొట్టే సంజీవరావు, పేరం ఉపేందర్, అంతోటి పీటర్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ బృందం డిమాండ్ చేసింది. ఈమేరకు మంగళవారం ఖమ్మంలో సర్వే చేపట్టింది. ఈ సందర్భంగా పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో సర్వే చేసి, రోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి ఎస్‌వీ.రాకేష్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకినపల్లి లలిత, ఆవుల మంగతాయి, శోభ, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని పీవైఎల్ జిల్లా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా ఎన్నికల ముందు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు అవి అమలు చేయకుండా నిర్లక్ష్యంగా ఉందన్నారు. వెంటనే ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేసి, రాష్ట్రంలోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మాదారపు ఉమాశంకర్ అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో చల్లా ఉపేందర్, సహాయ కార్యదర్శి బేతంపూడి నాగరాజు, కోలా దర్గయ్య, షబ్బీర్, అలెం గురవయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి మామిడి తోటలో గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కులమతాలకతీతంగా సహపంక్తి భోజనాలు చేసి ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు అదాలత్ నరేందర్, అధ్యక్షులు వెంపటి ఉపేందర్, నూనావత్ కిషన్, కార్యదర్శి ఎస్‌కె.జానీపాషా, కత్రం గిరి, రహీం, బూర్ల క్రిష్ణ, నవీన్‌కుమార్, నామాల నర్సింహారావు, గోవింద్, భద్రం, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్‌టీఐఓ హ్యాకథాన్ పోస్టర్లను కళాశాల చైర్మన్ కె.నవీన్ బాబు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 6, 7 తేదీల్లో కళాశాలలో నిర్వహించే హ్యాకథాన్ ప్రోగ్రామ్‌లో సాంకేతికతను మెరుగు పరుస్తూ ప్రోటోటైప్‌లు లేదా ప్రాజెక్టులను అభివృద్ధి చేసే లక్ష్యంతో సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి నామా కార్తీక్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వాల్సిందే..

కూసుమంచి: ఎరువులు, విత్తనాల డీలర్లు చట్టాలకు లోబడి వాటిని విక్రయించాలని, బిల్లులు లేకుండా విక్రయాలు చేపడితే చర్యలు తీసుకుంటామని కూసుమంచి ఏడీఏ సరిత హెచ్చరించారు. మంగళవారం కూసుమంచిలోని రైతు వేదికలో నిర్వహించిన ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ దుకాణదారుడు తమ లైసెన్స్‌లను కన్పించేలా చూడాలని, స్టాక్ బోర్డుల్లో వివరాలను కచ్చితంగా నమోదుచేయాలని, రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. అధిక ధరలకు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఓలు వాణి, అరుణ, డీలర్లు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మంగళవారం విద్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగానికి ఆమోదముద్ర వేయబడిన రోజుగా గుర్తు చేసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రమాణం చేస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు



రఘునాథపాలెం: గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నేలకొండపల్లి: బైరవునిపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు